ప్రత్యేక హోదా సాధనకై ఉద్యమించిన విద్యార్థులు

- ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై వెనక్కి తగ్గేదిలేదు
- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై హిందూపూర్ నుండి ఇచ్చాపురం వరకు జరుగుతున్న సమరయాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. ముందుగా కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ పర్యటించారు. అనంతరం పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఎన్ నాగభూషణ్, రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించినప్పుడు రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను నేటికీ 9 సంవత్సరంలో కావస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇవ్వనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నోరు మెదపకపోవడం అన్యాయం అన్నారు. విశాఖ ఉక్కును అమ్మేసిన కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయిం చలేకపోయినా ఇక్కడున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మాత్రం వాటి గురించి మాట్లాడటం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్ బాబు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలకై విద్యా ఉపాధి కోసం ఎవరు మాట్లాడిన పరిస్థితి ఏర్పడింది కాబట్టి విద్యార్థి యువ జన సంఘాలు చేస్తున్న సమరయాత్రలో రాజకీయ నాయకులు కళ్ళు తెరుచు కోవాలని తెలియ జేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లా లకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని పరిశ్రమలో రైల్వేజోన్ నీటి ప్రాజెక్టు లను పెట్టి ప్రజలను ఆదుకుంటామని చెప్పిన నాయకులు ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ ప్రత్యేక హెూదా విభజన హామీల సాధన సమితి నాయకులు చేస్తున్న సమరయాత్ర శుక్రవారం జిల్లాకు రావడం అభినందనీయమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రత్యేక హోదా లేకపోతే నిరుద్యోగ విద్యార్థుల ఐక్యతతో బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కే ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం గనిరాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సునీల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలగాడ రాజేష్, కోట అప్పన్న పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువచేసేందుకే గృహసారధులు

ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర-జామి: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే సీఎం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను ఏర్పాటుచేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జామి మండలం వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని వారికి ఇంకా ఏమి అవసరం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, జామి జెడ్పీటీసీ గొర్లె నరయు,జామి మండల వైఎస్సార్ పార్టీ కన్వీనర్ గొర్లె రవికుమార్,జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, స్టేట్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ డి.సత్యారావు, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, పి.విజయలక్ష్మి ,మండల వైఎస్సార్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశీ విద్యాదీవెన విద్యార్థుల పాలిట వరం

నిధుల విడుదల సందర్భంగా కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన విదేశీ విద్యాదీవెన పథకం విద్యార్థుల పాలిటవరమని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. విదేశీ విద్యాసంస్థల్లో చదువుకోవాలనే కోరిక ఉన్నవారికి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం దోహదపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా నుంచి ప్రస్తు తానికి ఇద్దరు ఎంపికయ్యారని వారికి ప్రభుత్వం రూ.20.24 లక్షల ఆర్థికసాయా న్ని మంజూరుచేసిందన్నారు. భవిష్యత్తులో మరింతమంది ఈ పథకంలో చేరి ఆర్థిక సాయాన్ని పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. రూ.8 లక్షల వార్షిక ఆదాయంలోపు కలిగిన విద్యార్థులు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించగా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ సూర్యకుమారి, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, డీసీఎంఎస్ ఛైర్ పర్సన్ అవనాపు భావన, డీసీసీబీ ఛైర్మన్ రామునాయుడు, సోషల్ వెల్ఫేర్ డీడీ రత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ళ సమస్యల పరిష్కారానికి 6న చలో కలెక్టరేట్ : సీపీఐ



విశాలాంధ్ర-వేపాడ : ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ. 5లక్షలు పెంచాలని ఈ నెల 6న సోమవారం చలో కలెక్టరేట్ ధర్నా చేపట్టడం జరుగుతుందని నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి దేగల అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బొద్దాంలో గల జగనన్న గృహ నిర్మాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆయన ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అందిస్తున్న లక్ష 80 వేలకు బదులు ఐదు లక్షల పెంచాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం గృహ నిర్మాణ లబ్ధిదారులతో చలో కలెక్టరేట్ ధర్నా చేపట్టడం జరుగుతుందని ఆ కార్యక్రమానికి గృహ నిర్మాణ లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వాహనాలను నిబంధనల మేరకు వేలం వేయాలి : ఎస్పీ దీపిక



విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: వివిధ పోలీసు స్టేషను పరిధిలో నాటుసారా, మద్యం అక్రమ రవాణకు పాల్పడుతూ పట్టుబడిన వాహనాలను నిబంధనలు మేరకు వేలం వెయ్యాలని పోలీసు అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం, నాటుసారా అక్రమ రవాణకు పాల్పడుతూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కేసుల్లో సీజ్ చేసిన వాహనాల యజమానులను గుర్తించి, వారికి నోటీసులను ఇచ్చిన అనంతరం వాటిని వేలం వేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే స్వాధీనం చేసుకున్న 191 వాహనాల యజమానులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులు, ప్రజలకు గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్ధాలను వివరించి, మత్తు పదార్థాలకు దూరం ఉండాలని కోరుతూ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి, విద్యార్థులు, ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన హెర్డింగులను వివిధ పోలీసుస్టేషను పరిధిలో ముఖ్య కూడళ్ళలో ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో మత్తు పదార్ధాల వినియోగించే వారి సమాచారాన్ని సేకరించేందుకు సమాచార బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి అవసరమైన చికిత్స అందించేందుకు మండల స్థాయిలో పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, మహిళా పోలీసులు, గంజాయి, మత్తు పదార్థాలు సమాచారంను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 14500 పట్ల అందరికీ చేయాలని, మత్తు పదార్ధ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలని ఎస్పీ అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఎస్.ఈ.బి. జేడీ అష్మఫర్ హీన్ మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషనులో నమోదైన కేసులను, సీజ్ చేసిన వాహనాలను సమీక్షించి, వేలం ప్రక్రియ చేపట్టుటలో అధికారుల సందేహాలు నివృత్తి చేసారు. కార్యక్రమంలో 2వ పట్టణ సిఐ సిహెచ్. లక్ష్మణరావు,రాజాం సిఐ కే.రవికుమార్, బొబ్బిలి సిఐ ఎం. నాగేశ్వరరావు,ఎస్ఐలు పాల్గొన్నారు.

డిజిటల్ కరెన్సీ పై చర్చ

విశాలాంధ్ర-డెంకాడ: ఎం.వి.జి.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎ) ఎం.బి.ఎ విభాగం, ఎం.బి.ఎ విద్యార్థులందరికీ సమకాలీన అంశం "సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (ది సిబిడీసీ) పై ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేసింది. రిసోర్స్ పర్సన్‌గా విజయనగరం లెర్నింగ్ సెంటర్ ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్ సి.హెచ్ సూర్యప్రకాష్‌ని ఆహ్వానించారు. రిసోర్స్ పర్సన్, సూర్యప్రకాష్ డిజిటల్ కరెన్సీ గురించి, చట్టబద్ధమైన టెండర్‌ను 'ఫియాట్ కరెన్సీ'గా జారీ చేయటం, క్రిప్టో కరెన్సీకి డిజిటల్ కరెన్సీ ఎలా భిన్నంగా ఉంటుందో వివరించారు. ప్రత్యక్ష ఉదాహరణలను అందించి విద్యార్థులను చర్చావేదికలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ప్రసంగానికి, ఎం.బి.ఎ హెచ్ ఓ డి.జి వి ఎస్ ఎస్ ఎన్ సన్యాసి రాజు, వివిఎం శ్రీనివాస్, టి.సాయిప్రసాద్, ఇతర ఎం.బి.ఎ సిబ్బందితో పాటు, మేనేజ్‌మెంట్ విద్యార్థులందరూ హాజరయ్యారు..

బొబ్బిలిలో త్వరలో రైతుబజార్

అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి



విశాలాంధ్ర-బొబ్బిలి: అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సమావేశం ఏఎంసి కార్యాలయంలో ఏఎంసీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరయ్యారు. సమావేశంలో ముందుగా ఇన్చార్జి కార్యదర్శి అరుణకుమారి సమావేశ అజెండాను చదివి వినిపించారు. బొబ్బిలిలో త్వరలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఏఎంసీ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ రైతులకు మరింత అవగాహన కల్పించాలని ఏఎంసీ డైరెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళి కృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఏఎంసి వైస్ ఛైర్మన్ తెంటు పార్వతి, ఏఎంసీ డైరెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడ్డ రేషన్ బియ్యం



విశాలాంధ్ర -వంగర: వంగర బస్‌స్టాండ్ వద్ద సివిల్ సప్లై బియ్యం ట్రాక్టర్ మీదనుండి జారీ పోవటం, డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల బస్తాలు టైర్ల కింద పడ్డాయి. వంగర మండలంలో గల ఎఫ్‌పి షాపులకు రేగిడి గొడౌన్ నుండి బియ్యాన్ని తరలిస్తూ వుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం రేగిడి గొడౌన్ నుంచి వంగర మండలంలో గల షాపుకు బియ్యాన్నితరలిస్తున్న సమయం లో వంగర బస్‌స్టాండ్ వద్ద ను చాలా వరకూ నేలపాలయ్యాయి. రాళ్లు, రప్పలు మధ్యనపడ్డ ఆ బియ్యాన్ని కలాసీలు ఎత్తివేసి డిపోలకు తరలించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తహశీల్దార్ ఐజాక్ దృష్టికి తీసుకెల్లగా నేలమీదపడ్డ బియ్యాన్ని డిపో లకు వేయవద్దని, వేరే బియ్యాన్ని ఆయా ఎఫ్.పి షాపులకు వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలియజేశారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి: ఎమ్మెల్యే



విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం మండలంలోని వైసిపి ప్రభుత్వం బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని గజపతిన ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. శుక్రవారం వైసీపీ కార్యాలయం ఆవరణలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు ముఖ్యమైన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్య క్రమా లను ప్రజల్లోకి తీసుకువెళ్లి బలోపేతం చేయాలన్నారు. తమకు అందజేస్తున్న ఫారం ను ఈనెల 25 లోగా నింపి అందజేయాలన్నారు. అంతకుముందు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకలు పాలవలస విక్రాంత్ ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక జడ్పీటిసి గార తవుడు మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు వైసీపీ నాయకులు బెల్లానా త్రినాధరావు పల్లి సంజీవరావు మండల సురేష్ సామంతుల పైడి రాజు లంక గణేష్ మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు ఎంపీటీసీలు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

రసాయన వ్యవసాయం వద్దు.. ప్రకృతి వ్యవసాయమే ముద్దు..



విశాలాంధ్ర-గరివిడి: మండలం గెడ్డపువలస గ్రామంలో తుమ్మగంటి అచ్చెన్నాయుడు 400 కేజీలు ఘన జీవామృతం తయారు చేయించారు. ఈ ఘనజీవామృతం తొలకరి దుక్కు లు దున్నేటప్పుడు పొలంలో వేసి దున్నడం వల్ల భూసారం పెరుగు తుంది. అలాగే యూరియా, డిఏపి అవసరం లేదు. దీనివల్ల రైతుకు ఖర్చు తగ్గుతుందిని తెలిపారు. భూసార అభివృద్ధి పెంపొం దించడమే కాక ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు తినడం వల్ల ఆరోగ్యాలు బాగుంటాయి. ఈ విధంగా గోవింద్ రెడ్డి రైతులకు వివరించారు. ఈ ఘన జీవామృతం తయారీ 100 కేజీల పేడ, తగినంత ఆవు మూత్రం, 2 కేజీలు బెల్లం, 2కేజీల శనగపిండి, గుప్పెడు పుట్ట మట్టి వేసి కలిపి ఉండలుగా చుట్టి నీడలో ఆరబెట్టాలి. బాగా ఆరపెట్టిన ఘన జీవా మృతంను ఆరు నెలల వరకు నిల్వ చేసు కోవచ్చు. కార్యక్రమంలో యూనిట్ ఇంఛార్జి కె.నాగమణి, లీడ్ ఫార్మర్స్, రైతులు పాల్గొన్నారు.

గృహ సారథులకు శిక్షణ



విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలం 22 గ్రామ సచివాలయల పరిధి లో ఇటీవల నియమించిన గృహ సారథులుకు తెర్లాం మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు పార్టీ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ నూతనంగా నియమించుకున్న గృహ సారథులు గత ప్రభుత్వం చేసిన మోసాలను ఎండ గడుతూ వైసీపీ చేస్తున్న అభివృద్ధి ప్రజలకు మరింత చేరువయ్యేలా తెలియజేయవలసిన బాధ్యత గృహసారథులపై ఉందని ఆయన సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ చేయడానికే గృహ సారధులు

ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



విశాలాంధ్ర-మెంటాడ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు ప్రజల్లోకి మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల పరిధిలో నూతనంగా గృహ సారధులను నియ మించినట్లు డిప్యూటీ సీఎం, గిరిజన మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. శుక్రవారం మండలంలో చల్లపేట గ్రామంలో ఏర్పాటు చేసిన గృహ సారుదుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయం కన్వీనర్లు వాలంటీర్ల సహాయంతో ఈ నెల 11వ తేదీ నుంచి నియమింపబడిన గృహ సారధులు ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వం చేసిన సహాయాన్ని సంక్షేమ పథకాలను వివరించి అందు సంబంధించిన ప్రసార మెటీరియల్ పంపిణీ చేయాలని కోరారు. అందుకు సంబంధించి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ,వైస్ ఎంపీపీలు సారికి ఈశ్వరరావు పొట్టంగి దుర్గ , జడ్పిటిసి లెంక సన్యాసి అప్పలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, పి ఏ సి ఎస్ అధ్యక్షులు మెంటాడ తాడ్డి రామచంద్రరావు, వైసిపి నాయకులు రెడ్డి రాజుఅప్పలనాయుడు, లెంక రత్నాకర్ నాయుడు పోరిపిరెడ్డి అప్పలనాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, డైరెక్టర్లు ,సర్పంచులు ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు ,వాలంటీర్లు మరియు గృహ సారదులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని పెనుబర్తిలో రామాలయం ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు ప్రతిష్టకు సిద్ధంగా ఉంచిన విఘ్నేశ్వరుడు, శివపార్వతులు, సీతారాముల, విగ్రహాలకు భక్తులు పాలాభిషేకం చేశారు. గ్రామంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై దేవతామూర్తి విగ్రహాలకు అభిషేకాలు చేశారు ఆలయ ప్రతిష్ట మహెూత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించినట్లు వైస్ ఎంపీపీ అంబల్ల లక్ష్మి, సర్పంచ్ తుమ్మగింటి మాధవి తెలిపారు. కార్యక్రమంలో అంబల్ల చిన్నారావు, తుమ్మగింటి పరమేశు, రెడ్డి అచ్యుత రావు, తదితరులు పాల్గొన్నారు

యువత కు విద్య తోపాటు క్రీడలు ముఖ్యం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు



విశాలాంధ్ర-కురుపాం: యువత కు విద్యతో పాటుగా క్రీడలు ముఖ్య మేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల. పరీక్షిత్ రాజు అన్నారు. శుక్రవారం కురుపాం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు పరిచయ అనంతరం బ్యాటింగ్ చేసి తొలి మ్యాచ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య తో మంచి భవిష్యత్ ఉంటే క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం, కొత్త పరిచయాలు, స్నేహం ఏర్పాటు తో విభిన్న అవకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణీ, పరీక్షిత్ రాజుల సహకారంతో మాజీ జడ్పీటీసీ అంధవరపు కోటేశ్వరరావు ఆద్వర్యంలో నిర్వహిస్తున్న కెపిఎల్ టోర్నమెంట్ కు మొదటి రోజు నాటికి నలభై టీం లు పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీలు బంగారు నాయుడు, స్వామియాజులు, సంతోషిరాణి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి. నాగేశ్వరరావు, ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ నిర్వహక కమిటీ సభ్యులు డి.నవీన్, హరీష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విదేశీవిద్యకు విద్యాదీవెన సహాయం



విశాలాంధ్ర-పార్వతీపురం: ఉన్నత విదేశీ విద్యను అభ్యసించాలనే అర్హులైన పేద విద్యార్థులు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంనుండి నిర్వహించిన జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రామానికి జిల్లాకలెక్టరు నిశాంత్‌కుమార్, వివిధ కళాశాలల విద్యార్థులు కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంనుండి వర్చువల్ గా హాజరైనారు. ఈసందర్భంగా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ విదేశీ విద్యను అభ్యసించాలనుకొనే పేదవిద్యార్థులకు కూడా ఉన్నతవిద్యను అందించుటకు, పేదవిద్యార్థుల ప్రతిభను, తెలివితేటలను ప్రోత్సహించుటకు ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలుచేస్తుందని తెలిపారు. విదేశీ యూనివర్సిటీలలో ప్రవేశాలుపొంది, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి ఎనిమిది లక్షలరూపాయలలోపుగల షెడ్యూల్డు కులాలు, జాతులు, మైనారిటీ, వెనుబడిన తరగతులు, అల్పాదాయం గల ఉన్నత వర్గాల విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకొని ఉన్నత విదేశీ విద్యను అభ్యసించ వచ్చునని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 100 టాప్ ర్యాంకు గలిగినయూనివర్శిటీలలో చదువుకోవడానికి ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా కోటి ఇరవైఅయిదు లక్షలరూపాయలు వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే విద్యార్థులకు విమాన, వీసాఛార్జీలు సైతం రీయింబర్స్ చేస్తున్నదని కావున విద్యార్థులు బాగా చదువుకోవడానికి విదేశీ విద్యా దీవెన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్, బి.సి.వెల్ఫేర్ అధికారి ఎన్. కృష్ణ, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి : సీపీఐ



విశాలాంధ్ర-పార్వతీపురం: కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. శుక్రవారం జియ్యమ్మ వలస మండలం పెదమేరంగి జంక్షన్ వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్యతో కలసి మీడియాతో మాట్లాడారు.ఆంధ్రరాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు ఇవ్వకుండా, ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసేలేక పోవడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని నష్టంచేస్తూ, అమరావతికి నిధులు ఇవ్వకుండా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు నిధులు మంజూరు చేయక పోవడంతో ఆంధ్రరాష్ట్రంపట్ల నరేంద్రమోడీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుం దన్నారు. కార్మికులకు సంబంధించి పరిశ్రమలు స్థాపనగాని, యువతకు ఉద్యోగ అవకా శాలు గాని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించేందుకు బడ్జెట్ లో ఏటువంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరమన్నారు.రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొంటున్న పోలవరం ప్రాజెక్టుగాని, విశాఖఉక్కుపరిశ్రమల ప్రస్తావనే బడ్జెట్ లో లేకపోవడం దుర్మార్గమన్నారు, ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఇకనైనా మేల్కొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాసమితి సభ్యులు పువ్వుల ప్రసాద్, మండంగి సింగన్న, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు కంటే జీవామృతం మేలు



విశాలాంధ్ర-పాచిపెంట: రసాయన ఎరువులు అయిన యూరియా డిఏపి మరియు పొటాష్ ఎరువులు పంటల ఎదుగుదలకు దిగుబడికి ఉపయోగపడతాయి కానీ భూమి భౌతిక స్వరూపాన్ని మార్చలేవు అంతేకాక విచక్షణ రహితంగా వాడితే అటు పంటల ను ఇటు భూమి ని కూడా పాడుచేసి రైతులకు అపార నష్టాన్ని మిగులుస్తాయి అని కావున రైతులు కేవలం రసాయన ఎరువుల మీదే కాకుండా ప్రకృతి ఎరువుల ను సమపాళ్లలో వినియోగిస్తే భూమి స్థితిగతులు మెరుగుపడి వానపాములు వృద్ధి చెంది కోట్లాది ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరిగి నేలను సారవంతం చేస్తాయని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు తెలిపారు.గరేళ్ల వలస రైతు పద్మాన మర్రి జోజి తన వరి పొలంలో వినియోగిస్తున్న ప్రకృతి ఎరువులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ జీవామృతం ప్రకృతి ఎరువని అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని వినియోగిస్తే ఇక ఎలాంటి రసాయని ఎరువులు వినియోగించాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో వి ఏ ఏ లక్ష్మణ్ రావు సిఆర్పి తిరుపత నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐ లో ఉచిత దంత వైద్య శిబిరం



విశాలాంధ్ర-సీతంపేట: ప్రభుత్వ ఐటిఐ లో శుక్రవారం నీరుకొండ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ అండ్ సైన్స్ వైద్యాధికారుల బృందం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి నవ్య హాజరయ్యారు. ఐటిఐ లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు వంపిణీ చేయడం సంతోషమని తెలిపారు. ఐటిఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఐటిఐ అభ్యర్థులు ఉద్యోగాలకు వెళ్లే సమయంలో ఈ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారు. 250 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అవినాష్, వరప్రసాద్, టీ హిమ, వర్షిని, వినీషా, హేమ తదితరులు పాల్గొన్నారు.

చినబోగిలిలో ఫ్రైడే డ్రైడే ర్యాలీ



విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపిఆర్డి వర్మ, సర్పంచ్ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకట నాయుడు, వైద్యసిబ్బంది, గ్రామ వాలంటీర్లు కలిసి ర్యాలీ నిర్వహించి శుక్రవారం కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఈఓపిఆర్డి వర్మ సమావేశం నిర్వహించి పంచాయతీ పన్నులు వసూలు తదితర అంశాలపై చర్చించారు.

ఎనిమిది గడ్డివాములు దహనం



విశాలాంధ్ర -మక్కువ: మండలంలో కోన గ్రామ సమీపంలో బొత్స శీను అనే రైతుకు సంబంధించి 8 గడ్డివాములు పూర్తిగా దహనమ య్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సాలూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి కొంత మేర మంటలు అదుపు చేశారు. ఈ లోగా చాలామేరకు దహనమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

మహిళా మండలి సేవలు స్ఫూర్తిదాయకం : మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ



విశాలాంధ్ర-సాలూరు రూరల్: పేద, వృద్ధ మహిళలకు స్ఫూర్తి మహిళా మండలి అందిస్తున్న సేవలు స్ఫూర్తి దాయకమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల.ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో కొంకివీధి కళ్యాణ మండపంలో స్ఫూర్తి మహిళామండలి 6వ వార్షికోత్సవ వేడుకలు డైరెక్టర్ బలగ రాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వుల.ఈశ్వరమ్మ హాజర య్యారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపట్ల స్ఫూర్తి మహిళామండలి పోరాటం శ్లాఘనీయమన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ జరజాపు దీప్తి మాట్లాడుతూ మహిళల కోసం పాటుపడే స్ఫూర్తి మహిళామండలి డైరెక్టర్ బలగరాధ కు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఐసిడియస్ అర్బన్ సిడిపిఓ బి.సత్యవతి మాట్లాడుతూ బాలికా విద్య, మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బాల్యవివాహాలు అరికట్టడంలో తమ వంతు కృషిచేస్తున్న స్ఫూర్తి మహిళా మండలి వారిని అభినందించారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చేతుల పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.స్ఫూర్తి మహిళా మండలి సభ్యులంతా కలసి ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ ఛైర్‌పర్సన్ జరజాపు.దీప్తి, అర్బన్ సిడిపిఓ సత్యవతి,స్ఫూర్తి మహిళామండలి డైరెక్టర్ బలగరాధలకు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో మహిళామండలి ఉపాధ్యక్షురాలు తస్లీమ్ బేగం మరియు మహిళలు పాల్గొన్నారు.....

మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దనే వైద్య సేవలు



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్ బందలుప్పి పి.హెచ్.సి. వైద్యధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచానికే పరమితమైన వారికి ఇంటికి వెళ్ళి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అంగన్వాడి పిల్లలుకి అంగన్వాడీ కేంద్రాలకి వెళ్ళి వారి ఆరోగ్యం తెలుసుకొని వారికి వైద్యం అందజేయడం జరుగతుంది. అదే విధంగా గర్భిణీలు, బాలింతలు, వయోవృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరికి ఆ గ్రామంలో వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడే మందులు ఇచ్చి జాగ్రతలు పాటించేలా చేస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్యసేవలు వినియెగించుకోవాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో సర్పంచ్, తీల్ల కృష్ణారావు, శ్రీధర్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించారని డిఎస్పి సుభాష్ అన్నారు.ఇటీవల అనకాపలిలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో విజయం సాధించిన క్రీడా విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ అనిల్ కుమార్ శర్మ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో (అండర్ జూనియర్ 17 బాయ్స్) ఎన్ జితేష్ బి దేవిసిస్ లు గోల్డ్ మెడల్ సాధించగా, సిహెచ్ అనంత్ హర్షిత శర్మ సిల్వర్ మెడల్ సాధించారని ఆర్ అభిషేక్ మీజన్ హుస్సేన్, హర్షిత్ శర్మ పూమ్స్ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన ఇరువురు విశాఖపట్నంలో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



విశాలాంధ్ర-బెలగాం : మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల వివరాలివి. పార్వతీపురం మునిసిపల్ బెలగాం బంగారమ్మ కాలనీకి చెందిన మొయిద శ్రీనివాసరావు రైల్వే ఇంజనీర్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం పార్వతీపురం నుండి రాయగడ వైపు వెళ్తుండగా కొమరాడ మండలం కోటిపాం మిల్లు దగ్గరలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్ తో ఢీ కొట్టి వెళ్లిపోయాడు. ఈసంఘటనలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. శ్రీనివాసరావు అపస్మారక స్థితిలో ఉండడంతో అతని భార్య అనిత ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోండి ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులు ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు శుక్రవారం మండలంలోని ఎంఆర్ నగరం లోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ద్వారా ఇచ్చిన కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ముగిసింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగారావు హాజరై శిక్షణ ముగించుకున్న విద్యార్థులకు ధృవ పత్రాలను అందజేసి సూచనలు సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి యు .సాయికుమార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్. హరికృష్ణ స్కిల్ హబ్ సెంటర్ కోఆర్డినేటర్ అశోక్ , గ్రామ ఎంపీటీసీ బదే రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు వద్ద ఉన్న ధాన్యం అంతటనీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏపీ రైతుసంఘం డిమాండ్



విశాలాంధ్ర-పాలకొండ: మండలంలో తుమరాడ గ్రామంలో అపరాలపంట పొలాలలో వరికుప్పలను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో అపరాల పంటైన పెసర, మినుము చేల మధ్య పంట పొలాలలో వరి బడిపెలు వేసి ఉన్నాయని వాటిని నూర్పులు చేయాలంటే పెసర, మినప మొక్కలు తీతలు ఫిబ్రవరి 25 వరకు ఉంటాయి. ఆ తర్వాతే వరి నూర్పులు రైతు చేయగలడని కనుక ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం సేకరణ కు ఫిబ్రవరి 15 పెట్టుకున్న గడువును మార్చి నెల వరకు పెంచాలని రైతు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల వివరాలు ప్రకారం రైతు అవస రాలు పోను మూడు లక్షల 18 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతులు మార్కెట్లో అమ్ము కుంటారని తెలపగా, ప్రభుత్వం రెండు లక్షల వరకు సేకరించి తదుపరి మీన మేష లెక్కించడం సమంజసం కాదని, రైతు పండించిన పంట అంతటినీ కొనుగోలు చేయకపోతే ఫిబ్రవరి 15 తర్వాత రైతు సంఘం రైతాంగంతో జిల్లా వ్యాప్తంగా నిరాహార దీక్షలతో పాటు తీవ్ర ఆందోళన కార్యక్రమం చేపట్టక తప్పదన్నారు. ప్రధానంగా తోటపల్లి, సాగునీటి వనరులు ఉన్న దగ్గర అపరాల పంట సాగు అవు తున్న నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఈనెల 15తో ఖరీఫ్ పంట సేకరణను గడువు ముగిస్తుంది. పై కారణాలు రీత్యా మార్చివరకు గడును పెంచాలి. కార్యక్రమంలో సంఘం నాయకులు కమిడి రామ్మూర్తి నాయుడు, గురుబిల్లి అప్పలనాయుడు, బుక్కాపట్నం వెంకటరమణ వందాన కుర్మారావు, బచ్చలపారి నాయుడు, నెల్లి చిన్నమనాయుడు, బొత్స సత్యనాయుడు తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : 2024 లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ క్యాడర్ పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం బలిజిపేటలో నిర్వహించిన గృహ సారథులు శిక్షణా కార్యక్రమంలో నియోజక వర్గం పరిశీలకులు శోభా హైమావతితో కలసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ప్రజల్లోకి మరింత చేరువ చేసే బాధ్యత మనందరిపైన ఉందన్నారు. వాలంటీర్, సచివాలయం వ్యవస్థలు ద్వారా అర్హులు అయిన ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తూ ఉన్నప్పటికీ ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోయినా వారిని కూడా గుర్తించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వారికి కూడా అందజేయడంతో పాటుగా ప్రతీ కుటుంబానికి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తెలియచేసి వారి వద్ద నుంచి పూర్తి మద్దతు కూడగట్టుకుని వచ్చే 2024 ఎన్నికల్లో మళ్లీ వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్య మంత్రిగా గెలిపించుకునే బాధ్యత గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు పైన ఉందన్నారు. పరిశీలకులు శోభా హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆలోచనను, చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి మరింత చేరువ చేసేందుకు పార్టీ తరుపున ప్రతీ 50 గృహాలకు ఇద్దరు గృహ సారథులు చెప్పిన రాష్ట్ర వ్యాప్తంగా నియామకం చేయడం జరిగినది అని కావున గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కృషి చేసి వచ్చే 2024 సాదారణ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపీపీ గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, బెవర హేమలత, మండల పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, జేసిఎస్ మండల కన్వీనర్ గంట్యాడ శ్రీరాములు నాయుడు, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు గులిపిల్లీ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

మందులు పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని సోంపురం గ్రామ పంచాయతీ పరిధిలో నాలుగు కిలోమీటర్ల దూరంలో నర్సిపల్లి మెట్ట వద్ద నివసిస్తున్న క్వారీ కార్మికులకు శుక్రవారం ఆరోగ్య శాఖ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.అనంతరం అక్కడి ప్రజలకు కుష్టు వ్యాధి మరియు స్పర్శ లేని మచ్చలపై సర్వే నిర్వహించి అవగాహన కలిగించారు. అదే విధంగా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య విద్య బోధన తనిఖీలు నిర్వహించి ఎన్సీడీ, సీడీ సర్వే అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వప్న కుమారి, ఆశా కార్యకర్త వసంత పాల్గొన్నారు.

ధరలు ఆకాశంలో.... అభివృద్ధి పాతాళంలో

ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు

విశాలాంధ్ర - కురుపాం : రాష్ట్రంలో నిత్యవసర ధరలు ఆకాశానికి అంటుతూ పేదవాడు అభివృద్ధి పాతాళానికి నెట్టి వేయబడిందని ఎమ్మెల్సీ శత్రుచర్ల. విజయ రామరాజు అన్నారు. శుక్రవారం జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామ పంచాయితీ పరిధిలో తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగధీశ్వరి, నాయకులు గురాన శ్రీరామమూర్తి, కర్రిరాజుల ఆధ్వర్యంలో' ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ విజయరామరాజు మాట్లాడుతూ అభివృద్ధి అంతా ప్రకటనలకే పరిమితము అయ్యిందని అన్నారు. నేడు ఎన్నికల నిర్వహణ జరిపితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అన్ని వర్గాలు లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొంగు. సురేష్, నాయకులు పల్ల రాంబాబు, నందివాడ కృష్ణబాబు, అంబటి రాంబాబు, కోట శరత్ కుమార్ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై అవగాహన

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని ముకుందపురం గ్రామంలో వాలంటీర్లు సచివాలయం సిబ్బందికి ఇంటి పన్ను వసూలుపై పంచాయతీ విస్తరణ అధికారి సూర్య నారాయణ అవగాహన కల్పించారు. అలాగే క్లాప్ మిత్రులకు పారిశుధ్యంపై అవగా హన కల్పించారు. గ్రామంలో మురుగు కాలువలు బహిరంగ ప్రదేశాలలో నీరు నిలువ లేకుండా చూడాలని వారిని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గోవాడ పద్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరకుల పంపిణీలో నిబంధనలు పాటించాలి

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ నుండి డిపోలకు రేషన్ సరకుల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుంటే చర్యలకు సిఫార్సు చేస్తానని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు హెచ్చరించారు. శుక్రవారం ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ రేషన్ స్టాక్ పాయింటును, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం స్టాకులను, రేషన్ డిపోలను ఆయన సంబంధిత అధికారులతో కలిసి తనికి చేసారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలోని రేషన్ షాపును, శ్రీనివాసకాలనీలోనే గల 1, 2 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సంబంధిత సరుకుల స్టాకులతో పాటు రిజిష్టర్లను పరిశీలించారు. గర్భిణీలు, బాలింత లకు సకాలంలో ఆహారాన్ని అందజేయాలని కార్యకర్తలకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు సూచించారు. ఆయన వెంట తహాశీల్దార్ డి.శ్రీనివాసరావు, పౌరసరఫరాల ఉప తహాశీల్దార్ ఎన్ఎవీఎస్ఎన్ మూర్తి, ఏఎసీ అశోక్, డిప్యూటీ విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు, మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్ సత్యం మాస్టారు, లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ, ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ కావ్యరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ దేవి తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన



విశాలాంధ్ర - గజపతినగరం : మండలం లోని జిన్నాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో సిహెచ్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేతన దారులకు గిట్టుబాటు ధర లభించేలా పనులు చేయాలని వారి మస్తర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేతన దారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు : డీఎల్‌డీఓ చంద్రమ్మ



విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ చంద్రమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సిపురం సచివాలయాన్ని ఆమె సందర్శించారు సిబ్బంది వాలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్డీఓ చంద్రమ్మ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వేయాలని అన్నారు. సూచించారు అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీది కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని అర్హులైన వారికి పథకాలు అందే విధంగా చూడాలన్నారు ఏవైనా వాటిపై సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని తెలిపారు. పథకాలకు సంబంధించి లోటు పాట్లు ఉంటే తక్షణమే ఉన్నత అధికారులకు తెలియజేసి సరి చేయాలని తెలిపారు. వచ్చిన వినతలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ పంచాయతీ సెక్రటరీ ఎం.జగన్ మోహన్‌రావు, వైసీపీ నాయకులు చెరుకుపల్లి రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వండి

విశాలాంధ్ర - సాలూరు రూరల్ : అంగన్ వాడీల సమస్యలపై కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించేందుకు తమకు అను మతి ఇవ్వాలని రూరల్ ప్రాజెక్ట్ పరిధి అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ సుగణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడుతూ అంగన్ వాడీల సమస్యలపై ఫిబ్రవరి ఆరవతేదీన జిల్లా కలెక్టర్లను కలసి వినతిపత్రం ఇచ్చేందుకు రాష్ట్ర నాయకత్వం పిలుపు నిచ్చిందన్నారు. ఆ పిలుపు మేరకు ప్రాజెక్టు పరిధిలో ఉన్న సాలూరు మండలం కార్యకర్తలు పార్వతీపురం కలెక్టర్‌నకు, రామభద్రపురం మండలం కార్యకర్తలు విజయనగరం కలెక్టర్‌నకు వినతిపత్రం అందజేయ నున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు కార్యకర్తలు పార్వతి, అరుణ, కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మనస్తత్వాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఈఎండిపి జోనల్ మేనేజర్ అగ్ని హెూత్ర శర్మ ఎస్ఈఆర్టీ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంట్రెప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు సృజనాత్మక నైపుణ్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని ఈఎండిపి జోనల్ మేనేజర్ ఓ.అగ్ని హెూత్ర శర్మ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మధనాపురం ఏపీ మోడల్ స్కూల్ ను జిల్లా మేనేజర్ కె.నరేష్ తో కలిసి సందర్శించిన ఆయన పాఠశాలలో జరుగుతున్న ఈఎండిపి ప్రోగ్రాం ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ అయిన పాఠశాల ఉపాధ్యాయులు వి.మధుసూధనరావు విద్యార్థిని, విద్యార్థులకు 16వ సెషన్‌లో భాగంగా సమస్య పరిష్కార పరిశోధన అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణ రావు గారు మాట్లాడుతూ ఈఎండిపి ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశ్యం మరియు మార్చ్ నెలలో జరగబోయే ప్రాజెక్ట్ ఎక్స్పో గురించి విద్యార్థులకు వివరించారు.

5న 'లక్ష బిల్వార్చన'

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఈనెల 5వ తేదీన (ఆదివారం) తెల్లవారుజామున 5గంటల నుండి 'లక్ష బిల్వార్చన'తో పాటు శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి, ఉమాదేవికి కళ్యాణం వైభవంగా జరిపించనున్నామని ఆలయ చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ తెలియజేసారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాటాడుతూ 5వ తేదీన లక్ష బిల్వార్చన, పంచామృతాభిషేకం, తిరుకళ్యాణం, అన్న సమారాధన ఉంటా యన్నారు. 16వ తేదీన ఏకాదశి సందర్భంగా అభిషేక పూజలు, దర్శనాలు, 18న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మహాన్యాస పూర్వకము, పంచామృతాలతో రుద్రాభిషేకం, 19న తెల్లవారు జామునుండి జాగరణ స్నానాలు, స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ రామకృష్ణ వివరించారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం : మాజీ ఎమ్మెల్సీ జగదీష్

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : రాష్ట్ర అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం కుంటు పడేసిందని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరు సమావేశంలో మాట్లాడారు అమరావతి రాజధాని అభివృద్ధి చేయకపోవడమే రాష్ట్ర అభివృద్ధి జరగలేదని అన్నారు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అమరావతి అభివృద్ధికి 2047 కోట్ల రూపాయలు కేటాయిస్తే ఇంత వరకు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేని అసమర్థత ప్రభుత్వం అని అన్నారు. అమరావతి అభివృద్ధి జరిగి ఉంటే రోడ్లు భవనాలు ఇతర మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి లేకపోవడం వల్ల పారిశ్రామికంగా అభివృద్ధి జరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజధానిపై ఎందుకు ఇంత కక్ష కట్టి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు కళ్ళు తెరిచి అమరావతిని అభివృద్ధి చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు కోల వెంకట్రావు, పట్టణ ,అధ్యక్షులు మండల పార్టీల అధ్యక్షుషులు డి.మోహన్ జి.రవికుమార్ , కౌన్సిలర్ బడే గౌర్నాయుడు, అరుక్కు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గర్బాపు ఉదయభాను, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొంగడి రామ్మూర్తి, నాయకులు రవణ పాల్గొన్నారు.

వంగర ఎంపీడీవోగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - వంగర : ఎంపీడీవోగా వావిల పల్లి శ్రీనివాసరావు బాద్యతలు చేపట్టారు. శుక్రవారం నాడు ఆయన వంగరలో బాధ్యతలు స్వీక రించారు. ఈయన ప్రస్తుతం రాజాం పంచాయతీ అధికారిగా పని చేస్తున్నారు. ఈ దినం ఆయన ఎఫ్ఏసీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ప్రజా ప్రతినిధులు, సిబ్బంది అందరి సహకారంతో మండల అభివృద్ధి కి ముందుకు సాగ నున్నట్లు పేర్కొన్నారు. ఈ యన గతంలో ఇక్కడ 2002 నుండి 2007 వరకూ వివిధ పోస్టుల్లో పని చేసిన అనుభవం ఉంది.

తాలాడ దీప్తికి గౌరవ డాక్టరేట్



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : లెప్రసిమిషన్ ద్వారా గత ఐదేళ్లుగా కుష్టివ్యాధి గ్రస్తులకు సేవలు అందిస్తున్న తాలాడ దీప్తికి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈమేరకు దీప్తి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో యాప్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (బెంగుళూరు) అనుబంధ సెయింట్ పాల్స్ థియోలాజికల్ కాలేజి యాజమాన్యం గురువారం రాత్రి విశాఖలోని ద్వారక నగర్ పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన 11వ స్నాతకోత్సవంలో ఈ డాక్టరేట్ ను అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిక్యుటివ్ కౌన్సిల్ మెంబరు, సీనియర్ ప్రొఫసర్ శోభాశ్రీ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొందు సీతారాం, కళాశాల ప్రిన్సిపల్ డా కె.వి.ఎన్.పాల్ చేతులు మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు దీప్తి తెలిపారు. విజయనగరానికి చెందిన దీప్తికి వికలాంగుల సేవలో డాక్టరేట్ లభించడం పట్ల పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సేవా దృక్పథాన్ని చాటుకున్న వాలంటీర్

విశాలాంధ్ర - వేపాడ : ప్రభుత్వం తమకు అప్పజెప్పిన పనులనే కాకుండా,తమ సొంత ఖర్చులతో ఆసుపత్రులకు వెళ్లి రోగులకు పింఛన్లు పంపిణీ చేసి గ్రామ వాలంటీర్లు సేవా భావాన్ని చాటుకుంటున్నార నడంలో ఎటువంటి సందేహం లేదు.అయితే మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు బుద్ధ అప్పయ్యమ్మ గత కొంతకాలంగా ఎముకలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ విశాఖ పట్నం తగరపువలసలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ గనివాడ శివ ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలకు పింఛన్ పంపిణీ చేయడం జరిగింది. వాలంటీర్ సేవలను మెచ్చుకొని గ్రామ పెద్దలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం నిల్వల మొత్తాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి : టీడీపీ

విశాలాంధ్ర - సీతానగరం : రోజుకోమాట పూటకోయాప్లతో రైతులను ధాన్యం సేకరణలో గందరగోళ పరిస్థితి సృష్టిస్తున్న అధికారులు గ్రామాల్లోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకొని రైతులధాన్యం మొత్తాన్ని కోనుగోలు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని జగ్గునాయుడుపేట గ్రామంలో రైతుల కళ్ళాలో ఉండే ధాన్యం బస్తాలువద్ద టిడిపి నియోజకర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో నిరశన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం పార్వతీపురం నియోజక వర్గంలో సీతానగరం, బలిజిపేట మండలాల్లో ధాన్యం దిగుబడి బాగా పెరిగి, పెద్దఎత్తున ధాన్యం నిల్వలుండగా ఇంతవరకు కేవలం రెండు లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కోనుగోలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల దాన్యాని కోనుగోలు చేయకపోతే టీడీపీ తరువున ఆందోళన కార్యక్రమాలని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతి రావు ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడు, మాజీ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, పెదభోగిలి సర్పంచ్ తేరేజమ్మ గరికియ్య, వెంకటినాయుడు, చంద్రమౌళి, ఆర్.వెంకంపేట మాజీ సర్పంచ్ పెంట ఉమా మహేశ్వరరావు సింహాచలం నాయుడు, సబ్బాన శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అవసరం : డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఆధ్యాత్మికత, సేవా తత్పరత నెలకొన్న ప్రాంతంలో తప్పక ఆ సమాజం అన్ని విధాల బాగుంటుందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శుక్రవారం నగరంలోని దాసన్నపేట కాపు వీధిలో శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర, విజయ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ, కాలభైరవ సహిత చండీశ్వర ఆలయ ప్రతిష్ఠ మహెూత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఆలయానికి చేరుకోగానే వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య, మంగళ వాయిద్యాల నడుమ నిర్వాహకులు ఆమెకు సాధర స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పరమశివునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ హితం కోసం చేసే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వారిలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగం రెడ్డి బంగారు నాయుడు, జోనల్ ఇంచార్జ్ బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, బొద్దాన వెంకటలక్ష్మి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బోడసింగి ఈశ్వరరావు, భోగాపురపు శ్రీనివాసరావు, నేతల సన్యాసిరావు, కందర్ప శ్రీనివాసరావు, రెడ్డి రామ్స్, నడిపేన రమేష్, సంగి శ్రీనివాసరావు, ఆల్తి చిట్టిబాబు, కలపర్తి లక్ష్మి, పెక్కు సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దయానిధిపురంలో ఫ్యామిలీ డాక్టర్

విశాలాంధ్ర - బెలగాం : సీతానగరం మండలం దయానిధిపురం గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సందర్శించి ఆరోగ్య పరీక్షలను, తనిఖీలను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణీ లు, బాలింతలు, సీజనల్ గా వచ్చే వ్యాధులు ఉన్న వారికి, అదేవిధంగా క్షేత్ర స్థాయిలో కదలలేని స్థితిలో వున్న వారిని, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారికి ఆరోగ్య పర్యవేక్షణ, అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, స్కూల్ పిల్లలకు ఆరోగ్య తనిఖీలు మొదలగు వైద్య సేవలందిస్తూ పలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుచున్నదని డాక్టర్ జగన్మోహన్ స్థానికులకు వివరించారు.

గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం/కురుపాం : గర్భిణీలకు పౌష్టికాహారం అందాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ ఆదేశించారు. గుమ్మ లక్ష్మీపురం మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన గుమ్మలక్ష్మీపురంలో బాలికల ఆశ్రమపాఠశాలను, సామాజిక ఆసుపత్రి, వై.టి.సిలో నిర్వహిస్తున్న గర్భిణీలవసతి గృహం, హెచ్.ఎన్.టి.సి లను తనిఖీ చేశారు. గర్భిణీల వసతిగృహం తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి వసతులు, ఆహార నాణ్యత గూర్చి ఆరాతీశారు. ఆహారంలో నాణ్యతకొరవడితే ఆహార సరఫరా ఏజెన్సీని మారుస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న వ్యక్తులతో నేరుగా మాట్లాడారు. వైద్యసేవలు, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం, ఆహారం, మందులు, టెస్ట్‌లు జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే గిరిజనులతో ప్రేమ, ఆప్యాయతతో మసలు కోవాలని సూచించారు. మంచి వైద్యం అందించి వారిలో ధైర్యం నింపాలని, జీవనవిధానం తెలియజేయాలని ఆయన ఆదేశించారు. చిన్న చిట్కాలు పాటించడం ద్వారా కొన్ని అనారోగ్య పరిస్థితులకు దూరంగా ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఎస్.కె.పాడు ఉద్యాన మరియు నర్సరీ శిక్షణా కేంద్రం (హెచ్.ఎన్.టి.సి)ను బుధవారం ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. హెచ్.ఎన్.టి.సి అభివృద్ధి వలన పర్యాటకంగా ప్రదేశం అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని చెప్పారు. హెచ్.ఎన్.టి.సి అభివృద్ధి అన్ని విధాల గిరిజనులకు ప్రయోజన కరంగా ఉంటుందని ఆయన చెప్పారు.

చినబుడ్డిడి గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : చిన బుడ్డిడి గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని ఆగ్రామస్తులు, పలువురు విద్యార్థులు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పార్వతీపురం డిపో నుంచి చిన బుడ్డిడి గ్రామానికి రోజుకి నాలుగు సార్లు బస్సు తిరిగేదని ఆ బస్సు నిలుపుదల చేయడంతో తోటపల్లి నందివానివలస పెద మేరంగి, చిన మెరంగి, అల్లువాడ, తుంబలి, జోగులదుమ్మ, బొమ్మిక జగన్నాధపురం, గెడ్డ తిరువాడ, అంకవరం గ్రామానికి చెందిన విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కావున ప్రజల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు పరిశీలన చేసి చిన బుడ్డిడి గ్రామానికి తక్షణమే బస్సును పునరుద్ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెలమల ఉపేంద్ర హరి నారాయణ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎ రాంప్రసాద్ కోరారు. శుక్రవారం మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ తండ్రి రాయవరపు అప్పలనాయుడు మాస్టర్ మృతికి సంతాపం తెలిపేందుకు వెళ్లారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అప్పలనాయుడు మాస్టర్ చేసిన కృషిని తెలిపారు. అనంతరం రాంప్రసాద్ మట్లాడుతూ రైతులు పండించిన దాన్యం నిల్వలను రాష్ట్ర ప్రభుత్వం కొద్దిగా కొనుగోలు చేసి ఆపేయటం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి రైతులు తమ కష్టాలను మీడియా ద్వారా వెల్లబోసుకుంటే రైతుల వద్ద వున్న దాన్యంను పూర్తి స్థాయిలో కొనాలని, దీనికి సంబంధించి వివరాలు ఇవ్వాలనీ సిబ్బందిని కోరిందన్నారు. వారు ఇచ్చిన మేరకు కాకుండా అందులో సగం కొనమని ఆదేశించడం దారుణమన్నారు. చాల మంది రైతులు తమ దాన్యం ప్రభుత్వం తీసుకుంటుందా లేక దళారులకు అమ్ముకోవాలా అనే దారుణమైన పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ప్రతిరైతు వద్ద ధాన్యం నిల్వలను కొనుగోలు చేయాలని కోరారు. లేని పక్షంలో టీడీపీ వారికి అండగా ఉండి ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్కవరపుకోట మాజీ జడ్పిటిసి సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కళా తపస్వి సినిమాలు విలువల వేదాలు : సముద్రాల గురుప్రసాద్



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రముఖ దర్శకుడు కె విశ్వనాథ్ మృతి తెలుగు సినీరంగానికి, తెలుగు ప్రేక్షకులకు తీరనిలోటని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. 2017లో విశ్వనాథ్ సినీ జీవిత విశేషాలపై నేను రాసిన కళాతపస్వి అనే పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన కిన్నెర పబ్లికేషన్స్ ప్రచురించింది. 2017 ఫిబ్రవరి 19వ తేదీన విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన స్వ గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితను అభినందించి విశ్వనాథ్ సత్కరించారు. ఈ పుస్తకావిష్కరణలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి మద్దాళి రఘు రామ్, ప్రముఖ సినీ విమర్శకులు ఎస్వి.రామారావు, సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి పాల్గొన్నారు. విశ్వనాథ్ సినిమాలు సంగీత భాండాగారాలు, విలువల వేదాలు.మనిషి విలువల నుంచి జనించిన సప్తపది పవిత్రతను వివరించారు. కళల కలయికతో "సాగరసంగమం", కల్మషం లేని ప్రేమతో "స్వాతిముత్యం", కళ యొక్క వైశిష్ట్యంతో " స్వర్ణక మలం" స్వర ప్రవాహ సిద్ధమైన "స్వరాభిషేకం" శృత్వమైన సరిగమల "శృతి లయలు" ఆయన దర్శకత్వ ప్రతిభకు పట్టంగట్టాయి. మానవ సంబంధాల విశిష్ట కోణాన్ని సప్తపది చిత్రం ద్వారా ఆవిష్కరించారు. కులమతాలు మనిషికే తప్ప మనసుకు, కళకు కాదని చాటిచెప్పారు ఆయన కీర్తికిరీటంలో సిరివెన్నెల ఒక మణిమకుటం వంటిది. తెలుగు సినీకేతనాన్ని అంత ర్జాతీయ వినువీధుల్లో కనువిందుగా ఎగురవేసిన లబ్ధప్రతిష్టుడు, ప్రేక్షక హృదయాల్లో సుప్రతిష్టుడు విశ్వనాథుడు. సినీ మాధ్యమానికి ఒక శృతిని ఒక లయను సమకూర్చిన కళాతపస్వి విశ్వనాథ్‌కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం తగదు

విశాలాంధ్ర - కురుపాం : పేద, మధ్య తరగతి వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిధులు తగ్గించి కేటాయించటం తీవ్ర అన్యాయమనీ, దశల వారీగా ఉపాధిహామి చట్టం నిర్వీర్యం చేసేందుకు నిధులు కేటాయింపు అమాంతం తగ్గించారని అన్నారు. బికెఎంయు జిల్లా కార్యదర్శి జి.సూరయ్య అన్నారు. శుక్రవారం మొండెంఖల్ పంచాయతీ శాంతి నగర్ లో మాట్లాడుతూ పేద ప్రజలకు, ఉపాధి హామీ కూలీలకి కేంద్ర బడ్జెట్లో ఉపాధి పథకానికి గాను భారీగా కోత విధించారని దీనివల్ల భవిష్యత్తులో వ్యవసాయ కూలీలకు, ఉపాధి కూలీలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య అన్నారు, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి 89 వేలు కోట్ల నుండి 30 వేల కోట్లకు తగ్గించడం జరిగిందన్నారు. ఏ ఉద్దేశ్యంతో అయితే పోరాడి సాధించుకున్న చట్టాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం క్రమేపి నీర్వీర్యం చేయడం గత ఎనిమిది సంవత్స రాలుగా చూస్తున్నామన్నారు,, బడ్జెట్ సమావేశాల్లో గ్రామీణ అభివృద్ధి, దేశ స్వావలంబన గూర్చి పెద్ద పెద్ద పదాలు వాడినప్పటికీ, గ్రామీణ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేది ఉపాధి హామీ పథకం వల్లనే అయింది, కరోనా కాలంలో ఇది కనిపించింది, ఇలాంటి చేదోడువాదోడుగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పువ్వుల ప్రసాద్, పత్తిక మోహనరావు, మండంగి సింగన్న, త్రిమూర్తులు పాల్గొన్నారు.

భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ప్రజా రవాణా ఈడి రవికుమార్



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రజా రవాణా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింత రవికుమార్ అన్నారు. శుక్రవారం 34వ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈడి రవికుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అత్యంత భద్రతగా ఉండాలన్నారు. ఆర్టీసీ బస్సులో డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ఎటువంటి ఆలోచనలు పెట్టుకో కూడదన్నారు. బస్సులో డ్రైవర్ వాహనాన్ని నడిపేటప్పుడు కండక్టర్ డ్రైవర్‌కు సహాయపడుతూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కే శ్రీనివాసరావు పార్వతి పురం మన్యం జిల్లాల ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ డిప్యూటీ సిటిఎం విజయనగరం జోన్ వన్ కే వెంకట్రావు జోన్ వన్ డిప్యూటీ సీఎం ఈ సిహెచ్ అప్పలనారాయణ, రెండు జిల్లాల డిపో మేనేజర్లు సూపర్వైజర్లు యూనియన్ అసోసియేషన్ సిబ్బంది పాల్గొన్నారు

వైస్ ఎంపీపీ గా సంపత్ కుమార్ ఎన్నిక

విశాలాంధ్ర - కురుపాం : జియ్యమ్మవలస మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పెదమేరంగి ఎంపీటీసీ గుడివాడ సంపత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికల అధికారి డిఆర్డిఎ పిడి పి.కిరణ్ కుమార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో ఎన్నికైన వైస్ ఎంపీపీ అనారోగ్యంతో మృతి చెందటం తో ఆయన స్థానంలో సంపత్ కుమార్ కు అవకాశం లభించింది. అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, ఎంపీటీసీలు, ఇతర పెద్దలందరికి ధన్యవాదాలు తెలిపారు.